# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 13-10-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

2. **అర్హులైన ప్రతి ఒక్కరికి సొంత ఇంటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు.**

3. **హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనులను వేగవంతం చేయాలని తెలంగాణ రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.**

4. **ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ పశ్చిమ బైపాస్‌లో జరిగిన కారు అగ్ని ప్రమాదంలో నలుగురు మృతి చెందారు.**

==========================

ప్రజల సమస్యలను త్వరితగతిన, సమర్థవంతంగా పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆర్టీజీఎస్ ద్వారా వివిధ శాఖల పనితీరును ముఖ్యమంత్రి నిన్న సమీక్షించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ -పీజీఆర్ఎస్ ద్వారా అందే సమస్యలను మరింత వేగంగా పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో 175 నియోజకవర్గాల నోడల్ అధికారులు పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించాలని తెలిపారు.

--------------------------

అర్హులైన ప్రతి ఒక్కరికి  సొంత ఇంటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. నెల్లూరు నగరంలోని వెంకటేశ్వరపురంలో టిడ్కో గృహాల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిడ్కో గృహాలను ప్రారంభించి, లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ,

వాయిస్ ..25.. సెకన్లు

--------------------------

హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారి 65 విస్తరణ పనులను వేగవంతం చేసి, వచ్చే ఏడాది జనవరి నాటికి ప్రారంభించాలని తెలంగాణ రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కేంద్రాన్ని కోరారు. భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ–ఎన్‌హెచ్‌ఏఐ ఛైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్‌తో ఢిల్లీలో నిన్న సమావేశమైన మంత్రి, పెరుగుతున్న వాహనాల రద్దీ, రహదారి ప్రమాదాల దృష్ట్యా పనులను త్వరగా చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం నాలుగు లేన్లుగా ఉన్న రహదారిని ఆరు లేన్లుగా విస్తరించడంతో పాటు, ఇరువైపులా సర్వీస్ రోడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. టెండర్ల దాఖలుకు నవంబర్ 11వ తేదీ చివరి తేదీగా నిర్ణయించామని, 2027 జనవరి నాటికి పనులు ప్రారంభిస్తామని ఎన్‌హెచ్‌ఏఐ ఛైర్మన్ హామీ ఇచ్చారు.

---------------------------

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుందని అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం చెరువులో మత్స్య సంపద యోజన రెండో విడతలో భాగంగా లక్షా 47 వేల చేప పిల్లలను నిన్న విడుదల చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ, మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. చేపల పెంపకాన్ని ప్రోత్సహించడంతో పాటు అర్హులకు రాయితీ అందిస్తున్నామని తెలియజేస్తూ...

వాయిస్..30.. సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని నూజివీడు మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో జిల్లాస్థాయి అవార్డుల్లో నూజివీడు మున్సిపాలిటీ ప్రథమ స్థానం సాధించిన సందర్భంగా నిర్వహించిన ఆత్మీయ అభినందన సమ్మేళనంలో మంత్రి నిన్న పాల్గొని అధికారులు, సిబ్బందిని సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత రెండున్నరేళ్లలో నూజివీడు మున్సిపాలిటీలో 70 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు మూడవ రోజుకు చేరుకున్నాయి. దీనిపై మా ఆకాశవాణి ప్రతినిధి మరిన్ని వివరాలను అందిస్తారు.

వాయిస్ ..30.. సెకన్లు

మరోవైపు శ్రీశైలం దసరా ఉత్సవాల్లో భాగంగా శ్రీ భ్రమరాంబికాదేవి బ్రహ్మచారిణి అలంకారంలో గత రాత్రి దర్శనమిచ్చారు. అలాగే తెలంగాణలో బతుకమ్మ సంబరాల్లో భాగంగా ఈ రోజు నాన బియ్యం బతుకమ్మను నిర్వహిస్తున్నారు.

---------------------------

దేశంలోనే ఆధ్యాత్మిక కేంద్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యమని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం మహమ్మదాపురంలో 2 కోట్ల రూపాయలతో నిర్మించనున్న శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి మంత్రి నిన్న భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 2028 చివరి నాటికి రాష్ట్రవ్యాప్తంగా 5 వేల ఆలయాల నిర్మాణాన్ని పూర్తి చేస్తామని వెల్లడించారు. ధూప, దీప, నైవేద్యాల పథకం కింద 6 వేల 7 వందల ఆలయాలకు నెలకు 10 వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ పశ్చిమ బైపాస్‌లో విద్యుత్ కారులో మంటలు చెలరేగి నిన్న సాయంత్రం నలుగురు మృతి చెందగా ఒకరు గాయపడ్డారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందటం విషాదకరమని, మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను మంత్రి ఆదేశించారు. బాధితుడి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు.

---------------------------

ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన అమలులో ఉత్తమ పనితీరుకు తెలంగాణలోని నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాలకు జాతీయ స్థాయి అవార్డులు లభించాయి. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఈ అవార్డులను నిన్న ప్రదానం చేశారు. రైతులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాల కల్పనలో నారాయణపేట జిల్లా, పరిపాలన, సేవల అందించడంలో నాగర్‌కర్నూల్ జిల్లా తొలి బహుమతులు సాధించాయి. ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రియాంక, హేమంత్ కేశవ్ పాటిల్ అవార్డులను అందుకున్నారు. ఈ పథకం కింద ఎంపికైన వంద జిల్లాలు వ్యవసాయ ప్రణాళికలను సిద్ధం చేసుకోవడం సంతోషకరమని, ప్రణాళికల అమలులో నోడల్ అధికారులు కీలక పాత్ర పోషించాలని కేంద్రమంత్రి సూచించారు.

---------------------------

బంగాళాఖాతంలో ఈరోజు అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా జిల్లాల్లో రానున్న నాలుగు రోజులపాటు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావారణ శాఖ తెలిపింది.

మరోవైపు తెలంగాణలోనూ రానున్న నాలుగు రోజులపాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

కేసుల పరిష్కారంలో ఆంధ్రప్రదేశ్ సమాచార హక్కు కమిషన్ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందని రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ ప్రధాన కమిషనర్ వజ్జా శ్రీనివాసరావు తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని రాష్ట్ర సమాచార కమిషన్ కార్యాలయంలో జరిగిన సమాచార హక్కు చట్టం వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో ఆయన నిన్న పాల్గొని ప్రసంగించారు.

=====================